

అనాథాశ్రమంలో బాలికలకు నోట్ పుస్తకాలు, పండ్లు పంపిణీ చేస్తున్న కోక రవి

అనాథ బాలికలకు నోట్ పుస్తకాల పంపిణీ

ముషీరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని బీఆర్ఎస్ యువజన కమిటీ గ్రేటర్ కార్యదర్శి కోకరవి అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో బాలికలకు నోటు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. బాలికలు బాగా చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కోకరవి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందిస్తూ ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆయనను సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు రాజేష్, అంజి, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగులో సైన్‌బోర్డులు పెట్టని

సంస్థల ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయాలి : టీడీపీ

రాంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగులో సైన్‌బోర్డులు పెట్టని సంస్థల ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. తెలుగు భాష ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో కచ్చితంగా అమలయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా సంస్థలు ఇంగ్లిషు, హిందీలో సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నాయన్నారు. పొరుగు రాష్ట్రాల్లో తమ ప్రాంతీయ భాషను అమలు చేస్తున్నాయని, మన రాష్ట్రంలో కూడా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ తదితరులు

కేంద్ర పథకాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ దేశాభివృద్ధికి కృషి చేస్తున్నారని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావని అన్నారు. వికసిత భారత్‌సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం అరుంధతినగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వికసిత భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బీజేపీ నాయకుడు ఎ. వినయ్‌కుమార్, రత్నసాయిచంద్, సత్తిరెడ్డి, శ్రీకాంత్, ప్రకాష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదివాసీల హక్కుల పోరాట సమితి నేతలు

ఆదివాసీలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలి

- 20న చలో హైదరాబాద్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడం దెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ జి. గణేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండలం, బట్టి సావర్గాం గ్రామంలో నివసిస్తున్న 2,043 మంది నిరుపేద ఆదివాసీలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఈనెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. తుడుందెబ్బ నాయకులు బాబురావు, మనోజ్, పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నవచండికాయాగం



యాగం నిర్వహిస్తున్న పండితులు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతన పెంపొందినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కె. గీతామూర్తి అన్నారు. మాగమాసం పవిత్రమైందన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం అన్నపూర్ణ బాలాత్రిపుర సుందరీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో నవచండికాయాగం కొండూరు పద్మావతి సారథ్యంలో, కుప్ప శివసుబ్రహ్మణ్య అవధాని పర్యవేక్షణలో పూర్ణాహుతి నిర్వహించారు. జానకి, సీతామహాలక్ష్మి, మధురిమ, సౌరబ్‌శర్మ, లక్ష్మి, శృంగేరి పీఠం వేదపండితులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలి

రాంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌నగర్ బస్తీలో డ్రైనేజీ, కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ జలమండలి నారాయణగూడ జీఎం రామకృష్ణకు బస్తీ అధ్యక్షుడు ఎర్రం శేఖర్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్ల క్రితం వేసిన డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందన్నారు. బస్తీలో నిత్యం మురుగునీరు పారుతోందన్నారు. సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

చిక్కడపల్లి ఏసీపీగా రమేశ్‌కుమార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి పోలీస్ డివిజన్ ఏసీపీగా ఎల్.రమేశ్‌కుమార్ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు.

'అక్రమ నిర్మాణాలతో పర్యావరణానికి ముప్పు'

రాంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలతో పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు రంగయ్య ఆరోపించారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిర్మాణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని విస్మరించడం, నిబంధనల మేరకు ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయకపోవడం, అనుమతులకు మించి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు.

రాజ్యసభకు అనిల్‌కుమార్ ఎంపికపై సంబరాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం. అనిల్‌కుమార్‌ను రాజ్యసభకు ఎంపిక చేయడంపై పార్టీ నేతలు శుక్రవారం సంబరాలు జరిపారు. గాంధీనగర్ ఆంధ్రాకేఫ్ వద్ద స్వీట్లు పంచి బాణసంచా కాల్చారు. మారిశెట్టి నర్సింగ్‌రావు, బాబ్జీ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

బీటీఎన్జీవో హౌసింగ్ సొసైటీ విచ్ఛిన్నానికి కుట్ర

బర్కత్‌పుర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ టీఎన్జీవో హౌసింగ్ సొసైటీని విచ్ఛిన్నం చేసేందుకు కొంతమంది కుట్రకు పాల్పడుతున్నారని గోపన్నపల్లి ఇళ్ల స్థలాల పరిరక్షణ సమితి చైర్మన్ పీవీవీ సత్యనారాయణ ఆరోపించారు. సొసైటీతో సంబంధం లేని కొంతమంది వాట్సాప్ గ్రూపులలో అసత్య సందేశాలను పంపిస్తూ, సొసైటీ సభ్యులను తప్పుదోవ పట్టిస్తున్నారని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

బ్రహ్మంగారి ఆలయ సమీపంలో

రూ. 88 లక్షలతో సీసీ రోడ్డు

ముషీరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారి దేవాలయ సమీపంలో రూ. 88 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ మాట్లాడుతూ.. ముషీరాబాద్‌లో డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులు పూర్తయిన ప్రాంతాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. షేర్‌అలీ వీధి, బాపూజీనగర్, పార్సిగుట్ట తదితర ప్రాంతాలలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేయాలన్నారు.

బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, ట్రేడ్ సెల్ డివిజన్ అధ్యక్షుడు టెంట్‌హౌస్ శ్రీనివాస్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్ గౌడ్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, నగర కార్యవర్గ సభ్యుడు జమాల్‌పురి నందు, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

గ్రామీణ బ్యాంకుల్లో పనిచేస్తున్న

తాత్కాలిక ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి



ధర్నాలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి. రవికాంత్, ఎన్. వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

కవాడిగూడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ బ్యాంకుల్లో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రీజనల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి. రవికాంత్, ఎన్. వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలో 15వేల మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు.

వారు మాట్లాడుతూ.. వివిధ గ్రామీణ బ్యాంకులలో ఖాళీగా ఉన్న 30వేల ఉద్యోగాలు భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. దేశంలోని గ్రామీణ బ్యాంకులను కలిపి జాతీయ గ్రామీణ బ్యాంక్ ఏర్పాటు చేయాలన్న పార్లమెంటు కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. సుప్రీం కోర్టు ట్రిబ్యునల్ అవార్డు తీర్పు మేరకు గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులకు వాణిజ్య బ్యాంక్ ఉద్యోగులతో సమానంగా సర్వీసు రూల్స్ ప్రమోషన్‌లు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈనెల 23న దేశ వ్యాప్తంగా ఒక రోజు సమ్మె, మార్చి 27, 28 తేదీల్లో సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో సంఘం ఆలిండియా ఉపాధ్యక్షుడు బిక్షమయ్య నాయకులు నర్సింహరాజు, అప్పలనాయుడు, క్రాంతికుమార్, రాజ్‌కుమార్, సత్యనారాయణ, సతీష్, వెంకట్‌రావు, ఉదయశ్రీ పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై ఎమ్మెల్యే మాట్లాడటం తగదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రాంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్‌పై ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అసెంబ్లీలో మాట్లాడటం తగదని కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, నేతలు అన్నారు. అంబర్‌పేటలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని వారు ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. శుక్రవారం డీడీ కాలనీలో విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులి జగన్, రాష్ట్ర నాయకులు గరిగంటి రమేష్, మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు మాట్లాడారు.

ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడుతూ.. అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డిపై అక్కసు వెళ్లగక్కడం సబబు కాదన్నారు. అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధి కోసం రోహిణ్‌రెడ్డి రూ. 20 కోట్లు మంజూరు చేయించారన్నారు. రోహిణ్‌రెడ్డి చెబితే నిధులు ఎలా మంజూరు చేస్తారని ఎమ్మెల్యే ప్రశ్నించడం బాధాకరమన్నారు. అభివృద్ధి పనుల్లో కమీషన్ల కోసం కాలేరు ఆరాటపడుతున్నారు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ప్రొటోకాల్ గురించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంబర్‌పేటలో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలకు ఎంపీ కిషన్‌రెడ్డిని ఎందుకు ఆహ్వానించడం లేదని ప్రశ్నించారు.

ఆకట్టుకున్న ఘంటసాల స్వరాంజలి



గాయకులు జలజ, దీప్తిని సన్మానిస్తున్న అతిథులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గోవింద్ మల్టీ టాలెంట్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయగానసభలో నిర్వహించిన ఘంటసాల స్వరాంజలి కార్యక్రమం ఆకట్టుకుంది. అమర గాయకులు పద్మశ్రీ ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా నవ భావాలకు-నవ రాగాలకు శీర్షికతో 9 మంది రచయితలు, 9 మంది సంగీత దర్శకులచే రూపొందించిన 50 గీతాలను గాయనీగాయకులు ఆలపించారు. టి. గోవిందరావు సంగీత సారథ్యంలో కార్యక్రమం జరిగింది. అనంతరం గాయనీమణులు జలజ, దీప్తికి ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాధరావు, ప్రముఖ గాయకులు చంద్రతేజ, గోవిందరావు, సంస్థ గౌరవాధ్యక్షులు వీఎస్ సుందరరావు, హరివిమల, ఎస్వీ రామారావు, ఆర్. శైలజశ్రీనివాస్ పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులపై దాడులను నివారించాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా దళిత క్రైస్తవులపై దాడులు పెరిగిపోతున్నాయని, వీటిని నిలిపివేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని క్రిస్టియన్ డెమోక్రటిక్ మూవ్‌మెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీఏ మెల్కి సేదెక్ డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామంలో మెథడిస్ట్ చర్చి సభ్యులపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని, దళిత క్రైస్తవులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. క్రిస్టియన్ డెమోక్రటిక్ మూవ్‌మెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి రేనాల్డ్ వెస్లీ, ఆర్గనైజర్ ఖురేషి, కో-ఆర్డినేటర్ ఎస్. అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిరంపై దాడికి ఖండన

చిక్కడపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జన్వాడ గ్రామంలో క్రైస్తవ ప్రార్థనా మందిరంపై దాడిని హెబ్రోన్ సొసైటీ సభ్యులు ఖండించారు. శుక్రవారం గోల్కొండ చౌరస్తాలో హెబ్రోన్ చర్చిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి రాగి వీరాచారి మాట్లాడుతూ.. ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. క్రైస్తవ సమాజం సంయమనం పాటించి దేశశాంతి కోసం ప్రార్థించాలని కోరారు. హెబ్రోన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్లపై విద్యార్థులకు అవగాహన

బర్కత్‌పుర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో కరోనా లాంటి ఎలాంటి మహమ్మారి వచ్చినా దానిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భారత్ బయోటెక్ సిద్ధంగా ఉందని సంస్థ క్వాలిటీ కంట్రోల్ హెడ్ డాక్టర్ బృందా గన్నేరు స్పష్టం చేశారు. శుక్రవారం నిజాంకళాశాలలో సంస్థ ఆధ్వర్యంలో వాక్సిన్ డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాధులను నివారించే వ్యాక్సిన్లు, వాటి ఉత్పత్తిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. మహమ్మారులను ఎదుర్కొనేందుకు విద్యార్థులు వారియర్స్‌గా పనిచేయాలని కోరారు. ప్రొఫెసర్ బి. బీమా, నిజాంకళాశాల రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ డి. సాంబశివ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న మాజీ మంత్రి పుష్పలీల, ప్రమోద్ మహరాజ్, హెచ్ఆర్ మోహన్ తదితరులు

సంత్ గురు రవిదాస్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మాదిగల ఆరాధ్యదైవమైన సంత్ గురు రవిదాస్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అఖిల భారతీయ రవిదాసీయ ధర్మ సంఘటన డిమాండ్ చేసింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీమంత్రి కె. పుష్పలీల, ధర్మసంఘటన రాష్ట్ర ప్రచారక్ ప్రమోద్ మహరాజ్ హెచ్ఆర్ మోహన్ ఐక్యమాదిగ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకులు శివరాజ్, మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము ప్రవీణ్‌కుమార్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ మాట్లాడారు.

దేవుడి దృష్టిలో అందరూ సమానులేనని ప్రచారం చేసిన మహనీయుడు గురు రవిదాస్ అని గుర్తు చేశారు.

బీసీ కులగణన తీర్మానంపై హర్షం

రాంనగర్/నల్లకుంట/చిక్కడపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేయడంపై తెలంగాణ కల్లుగీత సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాల్‌రాజ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేపీ మురళీగౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. మహేందర్ హర్షం వ్యక్తం చేశారు. బీసీ కులగణన బిల్లును ఆమోదించడం వల్ల బీసీలకు రాజకీయ, ఆర్థిక, విద్య, ఉద్యోగ అవకాశాల్లో జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం లభిస్తుందని కల్లుగీత సమన్వయ కమిటీ నేతలు అన్నారు. చట్టసభల్లో సైతం బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, దీనికి అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని ఎం. మహేందర్ కోరారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి

సీసీ రోడ్డు పనుల పరిశీలన

నల్లకుంట, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో ప్రభుత్వ ఆస్పత్రి, బొంగులపల్లి వీధుల్లో సీసీ రోడ్డు, తాగునీటి కనెక్షన్‌లను కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మాజీ కార్పొరేటర్ బి. వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి పరీక్షలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మోహినుద్దీన్ సూచించారు. శుక్రవారం ముషీరాబాద్ ప్రేయర్ పవర్ చర్చిలో కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే ముఠాగోపాల్, చర్చి వ్యవస్థాపకుడు శ్యామ్ అబ్రహం ప్రారంభించారు. డాక్టర్ మోహినుద్దీన్ మాట్లాడుతూ. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరానికి హాజరైన 250 మందిని పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు ఆర్. మెజెస్, డాక్టర్లు సయ్యద్ అబ్దుల్ అలీం, రవిచంద్ర, సుజిత్‌కుమార్, స్వాతి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామలాదేవికి ప్రత్యేక పూజలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రథసప్తమిని పురస్కరించుకొని శ్రీ శక్తిపీఠం ఆధ్వర్యంలో శ్యామలాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శక్తి పీఠం ఉపాసకులు శక్తి ఆనందస్వామి మాట్లాడుతూ.. ఈ నెల 19వరకు అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. చివరి రోజు అమ్మవారిని పల్లకీలో పురవీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.

కాచిగూడ రైల్వేస్టేషన్‌లో మహిళ అదృశ్యం



రేణుక

బర్కత్‌పుర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ఓ మహిళ అదృశ్యమైంది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన వేణుగోపాల్ భార్య రేణుక(40)తో కలిసి కుమార్తెను చూడటానికి నగరానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో కర్నూల్ ఎక్స్‌ప్రెస్‌రైలు ఎక్కడానికి శుక్రవారం ఉదయం 10 గంటలకు కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. వేణుగోపాల్ దివ్యాంగుడు కావడంతో వీల్‌చైర్‌లో నాలుగో ప్లాట్‌ఫారం వైపు వెళ్లాడు. రేణుక ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఎక్కింది. ఎంతసేపైనా భర్త వద్దకు వెళ్లలేదు. రేణుక ఆచూకీ లభించకపోవడంతో వేణుగోపాల్ కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

యువతి ఆత్మహత్య

చిక్కడపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమవుతోన్న ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా, ముప్పారం గ్రామానికి చెందిన శిరీష(34) జవహర్‌నగర్‌లో హాస్టల్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు ప్రిపేరవుతోంది. గతేడాది జూలై 1వ తేదీన గ్రూప్-4 పరీక్షలకు ఆమె హాజరైంది. టీఎస్‌పీఎస్సీ ఫలితాలు వెల్లడించగా.. మార్కులు తక్కువ వచ్చాని హాస్టల్‌లో శుక్రవారం రాత్రి ఉరేసుకుంది. సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలో సూసైడ్ లెటర్ దొరికినట్టు సమాచారం. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదు. మార్కులు తక్కువ వచ్చాయని ఒకరు.. ఆమె మానసిక స్థితి సరిగా లేదని మరో అధికారి పేర్కొనడం గమనార్హం.